క్లుప్తంగా

బాలికల ఆత్మరక్షణకు కరాటే



కరాటే విద్యపై శిక్షణ అందిస్తున్న దృశ్యం

మాడుగుల: బాలికల ఆత్మరక్షణకు కరాటే విద్య దోహదపడుతుందని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. శనివారం గాదిరాయి హైస్కూల్‌లో కరాటే శిక్షణ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలుపై అరాచకాలకు అడ్డు కట్ట వేయాలంటే విద్యార్థి దశ నుంచే బాలికలకు కరాటే నేర్పించడం అవసరమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

మాడుగుల: గాదిరాయి గ్రామానికి చెందిన ముద్దుర్తి వెంకటరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతని భార్య రామలక్ష్మికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలు వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ శనివారం అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమ కానున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడ్రే రామునాయుడు, పడ్రే రమణ, సలాది అచ్చింనాయుడు, శనివాడ మల్లునాయుడు, గట్రెడ్డి నానాజీ పాల్గొన్నారు.

102 మందికి వైద్య పరీక్షలు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా కె.జె.పురంలో శనివారం 102 మంది రోగులను వైద్యాధికారి కె. లీలాప్రసాదు పరీక్షించారు. యల్లపు సత్యసూర్యనారాయణమ్మకు బీపీ, సుగర్ అధికంగా ఉందని గుర్తించి వెంటనే 108 వాహనంలో చోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎంపీహెచ్‌ఈవో పి. రవికుమార్, హెచ్‌వీ పుష్పకాంతం, ఏఎన్‌ఎం శ్రావణి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీని పారదర్శకంగా చేపట్టాలని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. బోయిల కింతాడ గ్రామ సచివాలయ ఆవరణలో ఉపాధి కూలీలతో చేపట్టిన పనులు, మెటీరియల్ పనులపై శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సామాజిక తనిఖీలో గుర్తించిన పలు అంశాలను సామాజిక తనిఖీ బృందం ప్రజలకు వివరించింది. పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ



హాల్ టికెట్లు, అట్టలు అందిస్తున్న హెచ్‌ఎం అనురాధ

కె.కోటపాడు: పది పబ్లిక్ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ప్రధానోపాధ్యాయిని అనురాధ తెలిపారు. ఎ.కోడూరు హైస్కూల్‌లో పదో తరగతికి చెందిన 110 మంది విద్యార్థులకు శనివారం ఆమె హాల్ టికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎ.కోడూరుకు చెందిన దొగ్గ మల్లమ్మ చారిటబుల్ ట్రస్టీ దొగ్గ రామారావు, కిశోర్ అట్టలు, ఉపాధ్యాయులు రమాదేవి, బేగం పెన్నులు, పెన్సిళ్లు అందించారు.

చోడవరం ఇన్‌చార్జి ఎంపీడీవోగా చైతన్య



ఈవోపీఆర్డీ చైతన్య

చోడవరం: ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ చైతన్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్ విధి నిర్వహణలో భాగంగా కొంతకాలం శిక్షణకు వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా ఆమెను నియమించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ గాడి కాసు అభినందించారు.

అక్కచెల్లెమ్మల పరపతి పెంపు

- కె.కోటపాడులో వైఎస్సార్ మూడో విడత ఆసరా సంబరాలు
- పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఆసరా సభకు వేలాదిగా హాజరైన డ్వాక్రా మహిళలు

కె.కోటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా రుణాల వడ్డీ మాఫీ చేసి మహిళల పరపతిని పెంచారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం కె.కోటపాడులో మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల్లో చెల్లించారని, వచ్చే ఏడాది నాలుగో విడత నగదును లబ్దిదారుల ఖాతాల్లోకి వేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు అక్కచెల్లెమ్మల డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. 108 వాహనాలను నిరుపయోగం చేస్తే, సీఎం జగన్ ప్రతీ మండలానికి ఒక 108 వాహనాన్ని ఏర్పాటు చేశారన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఏర్పడి మరో రెండు రోజుల్లో ఏడాది కాబోతుందన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగానే అన్ని కార్యక్రమాలు, పథకాల అమలు చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయాల్లో పరిష్కారం కాని సమస్యలను ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమంలో లిఖిత పూర్వకంగా తెలపాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, మాడుగుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఉరుకూటి అప్పారావు, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వేచలపు దొరబాబు, బండారు ముత్యాలనాయుడు, వర్రి రామునాయుడు, చీపురపల్లి అచ్చిబాబు, బండారు కనక మల్లీశ్వరి, వంటాకు శ్రీను, బండారు మంగపతి, బండారు రామస్వామిపాత్రుడు, పైల అమ్మాజీ, ఎంపీడీవో కె.శచీదేవి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మహిళల్ని మోసగించిన చంద్రబాబు

- మరలా మీరే గుణపాఠం చెప్పండి
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



దిబ్బిడిలో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ



ఆసరా సభకు భారీగా తరలివచ్చిన మహిళలు

బుచ్చెయ్యపేట: డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని టోపీ పెట్టిన చంద్రబాబుకు రెండోసారి మహిళలు తగిన గుణపాఠం చెప్పాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అక్కచెల్లెమ్మలకు డ్వాక్రా రుణాల వడ్డీ మాఫీ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శనివారం సాయంత్రం దిబ్బిడి హైస్కూల్‌లో మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ప్రజా సంకల్పయాత్రలో మహిళల కష్టాలను నేరుగా చూసిన జగనన్న ఆనాడే ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని నిర్ణయించారన్నారు. అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నీ అందిస్తున్నారన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన దగ్గర నుంచి ఓటుకు నోటు, ఎమ్మెల్యేల కొనుగోలు వరకు చంద్రబాబునాయుడు పాలనంతా అవినీతిమయమేనని దుయ్యబట్టారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలోనే ఆయన కుమారుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నీతిమంతమైన పాలన అందిస్తున్నారన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో 1,297 డ్వాక్రా సంఘాల్లో 15,970 మంది మహిళలకు ఆసరా కింద రూ.30.40 కోట్ల రుణమాఫీకిగాను ఇప్పటికే మూడు విడతల్లో రూ.23.75 కోట్లు అందించామన్నారు. మూడో విడతలో ఎనిమిది కోట్ల రూపాయలు మహిళల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని భరోసా ఇచ్చారు.

రోడ్లకు అధిక ప్రాధాన్యం

బుచ్చెయ్యపేట మండలంలో అన్ని రోడ్లను అభివృద్ధి చేసి ప్రజలకు రవాణా సదుపాయం కల్పిస్తున్నానని విప్ ధర్మశ్రీ అన్నారు. గంధవరం నుంచి రోలుగుంట వరకు రూ.120 కోట్లతో రోడ్డును విస్తరించగా, ప్రస్తుతం అన్ని గ్రామాల్లో గోతులను పూడ్చడమే కాక నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తారన్నారు. బంగారుమెట్ట జంక్షన్ నుంచి అనకాపల్లి వరకు కేబీ రోడ్డును రూ.32 కోట్లుతో విస్తరణ పనులు చేస్తున్నామన్నారు. అనంతరం మహిళలకు మూడో విడత ఆసరా నమూనా చెక్కు అందించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీఎం వై. బాలరాజు, సీసీలు కొండయ్య, వెంకటరావు, రాజు, గణేష్, చిట్టిమ్మ పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు



సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం/మాడుగుల: అనాథులు, నిస్సహాయస్థితిలో పిల్లలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాయని మాడుగుల, నర్సీపట్నం ఐసీడీఎస్ సీడీపీవోలు శ్రీదేవి, కె.మేరీ సువార్త శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తల్లిదండ్రులు చనిపోయి అనాథులుగా మారిన పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున అందిస్తామన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2,400, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.1600 అందిస్తుందని తెలిపారు. రక్త సంబంధీకుల సంరక్షణతో నివసిస్తూ విద్యను కొనసాగేందుకు స్పాన్సర్‌షిప్‌ను ప్రభుత్వాలు మంజూరు చేస్తున్నాయన్నారు. వితంతువు, విడాకులు తీసుకున్న తల్లి పిల్లలు, తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, దీనస్థితిలో ఉన్న పిల్లలు, బాల కార్మికులు, బాల్య వివాహాలు, అక్రమ రవాణాకు గురైన వారి పిల్లలతోపాటు హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు, యాచక పిల్లలు స్పానర్ షిప్‌కు అర్హులు అన్నారు. పూర్తి వివరాలకు అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రందించాలన్నారు. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించి ఉండకూదన్నారు. అర్హత కలిగిన 18 ఏళ్ల లోపు చిన్నారులు వచ్చే నెల 15వ తేదీ లోపు అంగన్‌వాడీ లేదా సచివాలయ పోలీసు ద్వారా సంబంధిత సీడీపీవో కార్యాలయానికి అందజేయాలన్నారు.

సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు

మాకవరపాలెం: రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. తాడపాలలో రీ సర్వే పూర్తి కావడంతో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఈ ప్రక్రియను తహసీల్దార్ శనివారం పరిశీలించారు. రైతుల సమక్షంలో రాళ్లను సక్రమంగా ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



ముకుందపురంలో ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల రూరల్: జగనన్నకాలనీ లేఅవుట్‌లో ఇల్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని ముకుందపురం, కె.జె.పురం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లను ఆమె శనివారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. మండల హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, పంచాయతీ కార్యదర్శులు రెడ్డి కవిత, జగన్నాథరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



హాజరైన ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు

నర్సీపట్నం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండలాలధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గృహసారథుల సహకారంతో ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను ఎలా మోసం చేసింది, వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణ్ మూర్తి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వార్డు సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, నాలుగు మండలాల సచివాలయాల కన్వీనర్లు శానపతి వెంకటరత్నం, చిటికెల వెంకటరమణ, పాణి శాంతారామ్ పాల్గొన్నారు.

10 లోగా శతశాతం పన్నుల వసూలు

- డీపీవో శిరీషారాణి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మాడుగుల రూరల్: ఇంటి పన్నుల వసూలు ఈ నెల పదో తేదీలోపు శతశాతం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి ఆదేశించారు. శనివారం ఆమె ఎంపీడీవో మీనాకుమారితో కలిసి వి.వి.అగ్రహారం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల్లో ఎరువులను విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామ వలంటీర్లు, సిబ్బందితో కలిసి ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా సంబరాలు నేడు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించే వైఎస్సార్ ఆసరా సంబరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఏర్పాట్లు పరిశీలించారు. ఇక్కడ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, ఆసరా లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

చోడవరంలో అదనపు జిల్లా జడ్జి తనిఖీ



అదనపు జిల్లా జడ్జిని సత్కరించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డేవిడ్

చోడవరం రూరల్: సాధారణ తనిఖీల్లో భాగంగా ఉమ్మడి విశాఖ అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ శనివారం చోడవరం కోర్టులను సందర్శించారు. ఇక్కడ రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కోర్టుల పరంగా అవసరమయ్యే మౌలిక సదుపాయాలను గురించి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ, సీనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి, జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణల నుంచి సమాచారం రాబట్టారు. ఈ సందర్భంగా చోడవరం బార్ అసోసియేషన్ తరఫున అదనపు జిల్లా జడ్జి గోవర్ధన్‌ను గౌరవ పూర్వకంగా సత్కరించారు. న్యాయవాదుల సమస్యలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తి చేయించాలని కోరారు. జీపీ సత్యానారాయణ, న్యాయవాదులు వి.వెంకటరావు, సీహెచ్ బాబూరావు, వి.పైడిరాజు, కె.భాస్కరదాస్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

రావికమతం: మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 997 మంది హాజరు కానున్నార ని ఎంఈవో ఎస్.జయలక్ష్మి శనివారం తెలిపారు. రావికమతం హైస్కూల్‌లో 198 మంది, గర్ల్స్ హైస్కూల్‌లో 11 మంది, కొత్తకోట హైస్కూల్‌లో 245 మంది, దొండపూడి హైస్కూల్‌లో 235 మంది, ఏపీ మోడల్ స్కూల్‌లో 202 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. ఇప్పటికే ఆయా పరీక్ష కేంద్రాలను పరిశీలించామని, విద్యార్థులకు పూర్తి సదుపాయాలు కల్పించామన్నారు.

నాతవరం: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ శనివారం తెలిపారు. మండలంలో 564 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. నాతవరం, డి.యర్రవరం హైస్కూళ్లలోని పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి, తదితర సదుపాయాలు ఏర్పాట్లు చేశామన్నారు. మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుండా ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

గ్రామ అభ్యుదయ పుస్తకావిష్కరణ



గ్రామ అభ్యుదయ పుస్తకావిష్కరణలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వీఆర్వోల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి రచించిన గ్రామ అభ్యుదయ పుస్తకాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆవిష్కరించారు. చోడవరంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీరామ్మూర్తిని ఆయన అభినందించారు. రాష్ట్ర తూర్పు కోస్తా కారిడార్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్లను అందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, జోష్

కె.కోటపాడు: స్థానిక వెలుగు కార్యాలయంలో రోటరీక్లబ్, కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. మండలంలోని 50 మందికి వీటిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అందించారు. సామాజిక బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాడుగుల నియోజకవర్గంలో నిర్వహించాలని సూచించారు. రోటరీ డ్రిస్టిక్ట్ గవర్నర్ కిశోర్‌కుమార్, కన్సర్న్ చారిటుబల్ ట్రస్ట్ చైర్మన్ పి.కె.జోష్ పాల్గొన్నారు.

తాగునీటి వనరుల క్లోరినేషన్‌కు ఆదేశం

నాతవరం: గ్రామాల్లో తాగునీటి వనరుల క్లోరినేషన్, డ్రైనేజీలు శుభ్రం చేయుట వంటి పనులు నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. నూతన భవన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. హౌసింగ్ జోగారావు, ఆర్‌డబ్ల్యూస్ జేఈ రాజేష్, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ, ఏపీవో చిన్నారావు, పంచాయతీ విస్తరణాధికారి ప్రమీల పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ జమీలు మృతికి సంతాపం



జమీలు(ఫైల్)

నాతవరం: పెదగొలుగొండపేట మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొంప జమీలు (75) మృతికి పలువురు సంతాపం తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణించారు. ఉమ్మడి పెదగొలుగొండపేట పంచాయతీ(చినగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, పెదగొలుగొండపేట) సర్పంచ్‌గా 1981 నుంచి 1995 వరకు పని చేశారు. అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శెట్టి నూకరాజు, మాజీ సర్పంచులు వర్రే సత్యనారాయణ, పోలుపర్తి చిట్టిబ్బాయ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సబ్బవరపు వెంకునాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ, సర్పంచ్ మిరపల వెంకటరమణ, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గుడపర్తి అచ్చియ్యనాయుడు, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ కరక అప్పలరాజు, వేమల సూర్యానారాయణ, అంకంరెడ్డి పాలురాజు ప్రగాఢ సంతాపం తెలిపారు

విద్యార్థులకు స్టీల్ గ్లాస్‌ల పంపిణీ



స్టీల్ గ్లాస్‌లను అందజేస్తున్న ఎంఈవో రవీంద్రబాబు, హెచ్‌ఎం నాగమణి

దేవరాపల్లి: కాశీపురం హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులకు ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబు, హెచ్‌ఎం ఎం. నాగమణి శనివారం స్టీల్ గ్లాస్‌లను పంపిణీ చేశారు. ఇక్కడ ఉపాధ్యాయుడు కొట్టాన రాంబాబు తన తండ్రి సన్నిబాబు జ్ఞాపకార్థంగా సన్నీ చారిటబుల్ ట్రస్టు పేరిట స్థానిక హైస్కూల్, చంద్రయ్యపేట ఎంపీపీ స్కూల్, నాగయ్యపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు తన సొంత సొమ్ముతో వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో సీఆర్పీ ఆదిరెడ్డి ఈశ్వరరావు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద మహిళకు ఆర్థిక సాయం

మాకవరపాలెం: అనారోగ్యంతో మంచం పట్టిన పేద మహిళకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర ఆర్థిక సాయం అందించారు. జి.కోడూరు గ్రామానికి చెందిన మళ్ల నాగమణి తన కుమారుడికి మూడేళ్ల క్రితం కిడ్నీ దానం చేసింది. అయినప్పటికీ అతడు మరణించాడు. అప్పటి నుంచి ఆమె మంచం పట్టింది. ఈ నేపథ్యంలో శనివారం సూర్యచంద్ర రూ.30 వేలు అందజేసి తన మానవత్వం చాటుకున్నారు. పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ మండపానికి రూ.5 లక్షలు మంజూరు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి మండప నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. మండప నిర్మాణానికి లక్ష రూపాయల విలువ చేసే ఇనుమును సామర్లకోటకు చెందిన తలారి అర్జున్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంతోపాటు దాతలకు ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త దొండా వరహాలుదొర(కుమార్), ఆలయ కమిటీ సభ్యుడు విస్సారపు సూరిబాబు, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ దాడి రాజేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్ష మెటీరియల్ వితరణ



పరీక్ష మెటీరియల్ అందజేస్తున్నహెచ్‌ఎం

దేవరాపల్లి: ముషిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం ఉదయ్‌భాస్కర్, ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ శనివారం పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. 14 సంవత్సరాలుగా తన సొంత సొమ్ముతో వీటిని సమకూరుస్తున్న డబ్బారు కన్నయ్య మాస్టారుతో పాటు అతని కుమారుడు సన్యాసిరావును అభినందించారు. ఉపాధ్యాయులు కె. సత్యారావు, సుకన్య, పద్మావతి, భవానీ, సుజాత పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com